మినీ కథ

**శ్రీకాంత్** నాకు ఆఫీసుకి ఫోన్ చేశాడు!

"నీతో అర్జంటుగా మాట్లాడాలి. సాయంత్రం మనం ఎక్కడ కలుద్దాం?" అనడిగాడు.

"ఏవిటంత అర్జంటు?" అనడిగాను.

"ఫోన్లో చెప్పే విషయం కాదు. అర్జంటు."

"అయితే ఓ పని చెయ్యి. సరిగ్గా ఆరు గంటలకల్లా రవీంద్ర భారతి దగ్గర వెయిట్ చేస్తాను. అక్కడి కొచ్చెయ్యి" అని చెప్పాను.

"సరే-తప్పకుండా రావాలి" అని ఫోన్ పెట్టేశాడు.

శ్రీకాంత్ రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడు. నాకూ, వాడికీ దూరపు చుట్టరికం ఉంది. అంతకుమించి మంచి స్నేహితులంకూడా!

కొన్నేళ్ళ క్రితం వాళ్ళ నాన్నగారు రైల్వేలో ఉద్యోగం చేస్తూ పోయారు. అప్పటికి బి.ఎ. పాసై ఖాళీగా ఉన్న శ్రీకాంత్‌కి రైల్వేలో ఉద్యోగం ఇచ్చారు.

శ్రీకాంత్‌కి తల్లి, ఓ తమ్ముడు, ఓ చెల్లెలు ఉన్నారు. తండ్రి బాపతు డబ్బు బాంక్‌లో వేసి, జీతంలో జాగ్రత్తగా కాలక్షేపం చేస్తున్నాడు. చెల్లెలి పెళ్ళి, తమ్ముడి చదువు వాడికున్న బాధ్యతలు. వాడికి తల్లన్నా, తోడబుట్టిన వాళ్ళన్నా అభిమానం... ప్రేమ. స్వసుఖాలు, తన సరదాలు మానుకుని వాళ్ళకి ఏదో చెయ్యాలని తాపత్రయ పడుతుంటాడు. వాడిలో ఆ లక్షణం నాకు బాగా నచ్చుతుంది.

ప్రతివాడూ లోకాన్ని, బంధాల్ని, బాంధవ్యాల్ని డబ్బు కోణంలో చూస్తున్న రోజు లివి. ఇలాంటి రోజుల్లో శ్రీకాంత్‌లాంటి ఆణిముత్యాలు మనుసుల్లో అక్కడక్కడా ఉన్నారు.

శ్రీకాంత్ కన్నా నేను రెండేళ్ళు పెద్దవాణ్ణి. పైగా వాడికి నా మాట మీద గురి. వాడి స్వవిషయాల్లోనూ, కుటుంబ విషయాల్లోనూ నా సలహా సంప్రతింపులు అడుగుతుంటాడు. బహుశా ఏదో సలహా కావలసి వచ్చి నన్ను కలవాలని ఫోన్ చేసి ఉంటాడని అనుకున్నాను.

ఆఫీను అయ్యాక బయటపడి కాస్త వేడి వేడి కాఫీ తాగి రవీంద్ర భారతి దగ్గరకి చేరుకున్నాను. మరో పది నిమిషాలకి శ్రీకాంత్ వచ్చాడు.

"ఏవిటంత అర్జంటు?" అనడిగాను.

"చెప్తాను. రా-అలా లాన్స్‌లో కూర్చుందాం."

రెండు నిమిషాలు ఇద్దరం మౌనంగా ఉన్నాం.

"ఈ ఆడాళ్ళు చిత్రమైన మనుషులు!" శ్రీకాంత్ ప్రారంభించాడు.

"ఏమైంది?"

"మా చెల్లెలి కో సంబంధం చూశాను."

"అవును. ఆమధ్య చెప్పావు కదా!"

"అసలే ఆడపిల్లలకి సంబంధాలు కుదరడం కష్టంగా ఉన్న రోజులు..."

"అవును. ఇంతకీ ఏమైంది?"

"పిల్లాడు బాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. నాతో పని చేస్తున్నాయనకి చుట్టం. పిల్ల నచ్చితే కట్నకానుకల విషయం తను కుదిర్చి పెడతానని మా ఆఫీసాయన అంటున్నాడు."

"మరి పెళ్ళిచూపులయ్యాయా?"

"అయితే సమస్యేముంది? ఈలోగా మాఅమ్మ చెల్లెలు ఏవో సందేహాలు లేవదీశారు."

"ఏమిటవి?"

"పెళ్ళికొడుక్కి నాలాగే తండ్రి లేడు. పైగా అతనికీ చెల్లెలు పెళ్ళికుంది. చెల్లెలికి పెళ్ళి చేసి పంపేసిన తల్లి, ఇద్దరు తమ్ముళ్ళు అతనితో ఉంటారు."

"తప్పేముంది? తండ్రి లేనప్పుడు తల్లి, తమ్ముళ్ళు అతనితో ఉండటం లోకధర్మం కదా!"

"అదే నేనూ మొత్తుకునేది-అమ్మ వినడం లేదు."

"ఆవిడ ఏవంటారు?"

"పిల్లకి బాధ్యతలు నెత్తిన పడతాయి. అత్తగారు బతికున్నన్నాళ్ళు దీని నెత్తిమీదే ఉంటుంది. ఈ సంబంధం వద్దు అంటోంది. పోనీ చదువుకున్నది-అదేనా కాస్త జాగ్రత్తగా ఆలోచిస్తుం దనుకుంటే చెల్లాయి అమ్మకి వంత పాడుతోంది."

నాకు మతి పోయింది.

మనుషులు ఇంత అల్పంగా ఆలోచిస్తారంటే ఆశ్చర్యం కలిగింది. ఆ పెళ్ళికొడుక్కి ఉన్న సమస్యలు, బాధ్యతలు శ్రీకాంత్‌కీ ఉన్నాయి. వాడు అవన్నీ మొయ్యడం లేదా? వాడికి పెళ్ళైతే వాడి పెళ్ళాంకూడా అవన్నీ మొయ్యాలి కదా?

మరి అవే బాధ్యతలు తన కూతురు మొయ్యాలంటే ఆవి డెందు కంత బాధ పడిపోతోంది? ఆ అమ్మాయి ఎందు కంత భయపడిపోతోంది? ఎందు కీ రెండు రకాల నీతులు? ఎందు కీ రెండు రకాల ధర్మాలు?

"ఏం చెయ్యమంటావ్?" శ్రీకాంత్ అడిగాడు.

"ఆ పిల్ల వద్దు మొర్రో అంటే ఎందుకు కట్టడం-సంబంధం వదలుకో" అన్నాను. వా డలాగే చేశాడు.

మరో ఏడాదికి గాని ఆ పిల్లకి సంబంధం కుదరలేదు. కొంతమంది మనుషుల జీవితాల్లో అనుకున్నవి అనుకున్నట్టు జరుగుతాయి. శ్రీకాంత్ చెల్లెలికి సంబంధం కుదిర్చాడు. పిల్లాడికి ఉద్యోగం ఉంది. తల్లితండ్రులున్నారు గాని, అతనికి వాళ్ళతో పడదు. తన వాటా ఆస్తిపాస్తులు తీసేసుకుని అతను వాళ్ళతో తెగతెంపులు చేసేసుకున్నాడు. తల్లితండ్రులు అతని తమ్ముడి దగ్గర ఉంటారు.

మిగిలిన బాధ్యతలు కూడా ఏవీ లేవు. శ్రీకాంత్ తల్లికి, చెల్లెలికి పూర్తిగా నచ్చిన సంబంధం ఇది. మరో అయిదువేలు కట్నం ఎక్కువైనా శ్రీకాంత్ ఈ సంబంధం ఖాయం చేసి ధూం ధాంగా పెళ్ళి జరిపించాడు. పెళ్ళికి నాకు చేతనైన సహాయం నేను చేశాను.

కాని, కొద్ది రోజుల్లోనే తెలిసింది- ఆ కుర్రాడు వ్యసనపరుడనీ, తాగుడే కాకుండా వేరే అమ్మాయితో సంబంధం పెట్టుకున్నాడనీ. రెణ్ణెల్లకి, మూణ్ణెల్లకి పెళ్ళాన్ని తన్ని పుట్టింటికి పంపించేస్తాడు.

వారి దాంపత్యం సరిదిద్దాలని శ్రీకాంత్ అన్ని విధాలా ప్రయత్నం చేశాడు కాని, కుదరలేదు.

వాడి కిదో పెద్ద సమస్య అయిపోయింది.

రెండేళ్ళ పాటు వాడి చెల్లెలు మొగుడింటికి, పుట్టింటికి తిరిగింది. రెండేళ్ళ తరవాత ఆ సమస్య రాలేదు.

శాశ్వతంగా పుట్టింటికి గెంటేశాడు మొగుడు.

** ** **

ఆ రోజు...

శ్రీకాంత్ రవీంద్ర భారతి దగ్గర నాతో మాట్లాడిన విషయాలన్నీ జ్ఞాపకం వచ్చాయి.

'శాస్తి బాగా అయిందిలే!' అని నేను సంతోషించడం లేదు.

కాని... 'తల్లిని చూడని వాడు పెళ్ళాన్ని చూస్తాడన్న గ్యారంటీ లేదు' అని ఒక థియరీ ఏర్పాటు చేసుకున్నాను.

అంతే!!

-వీరభద్రరావ్ పమ్మి

